క్లుప్తంగా

హామీలపై చేతులెత్తేయడం సిగ్గుచేటు

● వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి టి.కామేశ్వరి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అధికారం కోసం అడ్డగోలుగా హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు.. ఇప్పుడు చేతులెత్తేయడం సిగ్గుచేటు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి టి.కామేశ్వరి మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నీతి ఆయోగ్ నివేదికను సాకుగా చూపించి ఎన్నికల హామీలు అమలుచేయలేమని చెప్పడం సరికాదన్నారు. రాష్ట్రంలో అప్పులు, ఆస్తుల సంగతి ఇప్పుడు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతు తనదని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన పవన్‌కల్యాణ్ గొంతు ఇప్పుడు మూగపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలంతా కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయామని గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలన్నీ నిలబెట్టుకున్న నాయకుడు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలందరికి వైఎస్సార్‌సీపీ పాలన విలువ ఇప్పుడు తెలుస్తోందని పేర్కొన్నారు.

మౌని అమావాస్య పూజలు నేడు

గార: మౌని అమావాస్య సందర్భంగా బుధవారం ఉదయం నుంచి శ్రీకూర్మనాథాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు సీహెచ్.సీతారామనృసింహాచార్యులు తెలిపారు. భక్తులు శ్వేతపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి పితృ కార్యక్రమంలో పాల్గొనడం, శ్రీకూర్మనాథస్వామిని దర్శనం చేసుకుంటారని పేర్కొన్నారు.

జల్లపేటలో పశువైద్య శిబిరం

గార: శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేట సచివాలయ పరిధిలోని జల్లపేటలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం ప్రారంభించారు. ఇన్‌చార్జి ఏడీ పీఎస్‌జీ బాలకృష్ణ, పశు వైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న బృందం

అరసవల్లి: స్థానిక అరసవల్లి మోహన్ క్లినిక్‌లో పేదల కోసం మంగళవారం నిర్వహించిన బీఎండీ (బోన్ మినరల్ డెన్సిటీ) ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ ఇంజరాపు మోహన్ ఆధ్వర్యంలో టోరెంటో ఫార్మా కంపెనీ సమక్షంలో నిర్వహించిన ఈ పరీక్షలకు సుమారు 200 మంది పేదలు హాజరయ్యారు. కార్యక్రమంలో టోరెంటో ప్రతినిధులు ఎర్రంనాయుడు, సుందర్, రమేష్, మైగాపు అప్పన్న, తెలుగు మోహనరావు, నక్క రామకృష్ణ బి.వెంకటేష్ పాల్గొన్నారు.

పరీక్షల విధానం బలోపేతంపై దృష్టి



సమీక్ష నిర్వహిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: పోస్టు గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, ఇతర కోర్సుల పరీక్షల విధానం బలోపేతం చేయడంపై దృష్టి పెడుతున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ పాలక మండల సమావేశ మందిరంలో మంగళవారం పరీక్షల నిర్వహణపై సమీక్ష, సైన్స్ సబ్జెక్టుల బోర్డాఫ్ స్టడీస్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీ మాట్లాడుతూ ప్రయోగ పరీక్షలు పారదర్శకంగా జరగాలని అన్నారు. ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో జంబ్లింగ్ పద్ధతిలో ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రయోగ పరీక్షలు, థియరీ పరీక్షల పర్యవేక్షణకు ప్రత్యేక పరిశీలకులు, స్క్వాడ్‌లను నియమించనున్నట్లు వివరించారు.

కేంద్రమంత్రిని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన సిరిపురం తేజేశ్వరరావు కూటమి ప్రభుత్వంలో భాగంగా కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడును తన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు అట్టాడ రవిబాబ్జి, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, బిర్లంగి రామ్మోహన్‌రావు, చింతపల్లి దుర్గారావుగాంధి, బైపల్లి రాజేశ్వరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

శ్రీకాకుళం క్రైమ్: ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొండేటివీధిలో వ్యక్తిపై దాడి జరిగినట్లు ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. గోల్కొండ రేవుకు చెందిన రామకృష్ణ పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. మొండేటివీధికి చెందిన హేమలత తను ప్రేమ వివాహం చేసుకోగా వీరికొక పాప జన్మించింది. మూడు నెలలుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో హేమలత పాపతో కలిసి పుట్టింటికి వెళ్లిపోయింది. కుమార్తెను చూసేందుకు మంగళవారం అత్తవారింటికి వెళ్లిన రామకృష్ణను హేమలతకు తమ్ముడు వరసైన సతీష్ రాడ్‌తో దాడికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లక్ష్యం నెరవేరేనా?

● పీఏసీఎస్‌ల అప్‌గ్రేడ్ ప్రక్రియలో జాప్యం
● వ్యవసాయ, ఇతర పనులు కారణంగా అందుబాటులోకి రాలేకపోతున్న రైతులు
● మరో రెండు రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు



అంపోలు పీఏసీఎస్ కార్యాలయం



గారలో ఏర్పాటు చేసిన తూలుగు పీఏసీఎస్ కార్యాలయం

గార: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) కంప్యూటరీకరణ పూర్తిచేసి రైతులకు పారదర్శకంగా సేవలందించాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నాబార్డు సహకారంతో దేశమంతటా రికార్డుల క్రమబద్ధీకరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాల్సి ఉండగా, కొద్ది రోజుల సమయంలో పని పూర్తిచేయాలని టార్గెట్లు పెడుతున్నారు. దీంతో పనుల్లో ఉన్న రైతులు, సచివాలయ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండలంలోని అంపోలు, తూలుగు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. వీటిలో అంపోలు పీఏసీఎస్ పరిధిలో 3324 మంది రైతులుండగా, 2144 మందికే డీసీటీ పూర్తయింది. ఇంకా 268 మంది వివరాలు అప్‌లోడ్ కాలేదు. అంపోలు పీఏఎస్‌లో 2798 మంది రైతులకు గానూ 2007 మంది వివరాలు మాత్రమే అప్‌లోడ్ చేశారు. ఇంకా 296 మంది వివరాలు నమోదు కాలేదు.

సిబ్బంది వస్తున్నారు..



కిడ్నీ సంబంధ వ్యాధితో ఆస్పత్రికి తిరుగుతున్నాను. ఈకేవైసీ కోసం చేయాలని ప్రతి రోజూ సచివాలయ సిబ్బంది ఇంటికి వస్తున్నారు. సోమవారం సాయంత్రం కూడా ఇద్దరు ఉద్యోగులు ఇంటికి వచ్చారు. అందుబాటులో లేకపోవడం మరలా మంగళవారం ఉదయం వచ్చారు. అనారోగ్యం వల్లే అందుబాటులో లేను.

– చల్ల కృష్ణమూర్తి, చల్లపేట, పీఏసీఎస్ ఖాతాదారుడు, అంపోలు

శ్రీకూర్మం మేజర్ పంచాయతీ, బందరువానిపేట మత్స్యకార గ్రామంలో సచివాలయ సిబ్బంది ఈకేవైసీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ సిబ్బందిలో వెల్ఫేర్ అసిస్టెంట్, ఉమెన్ పోలీస్‌కు లాగిన్ చేసేందుకు అవకాశమిచ్చారు. వారి సొంత పనులు చూసుకుంటూ, ఈ పని కూడా మరో రెండు రోజుల్లో పూర్తి చేయాల్సి ఉంది.

మరో రెండు రోజులే గడువు..

డేటా క్యాప్చర్ టూల్ (డీసీటీ) పద్ధతి మరో రెండు రోజుల్లోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. దీనిపై జిల్లా వారీగా ఉన్నతాధికారులు రోజూ సమీక్ష చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 31లోగా రైతుల వివరాలు, రుణం తీసుకున్న వివరాలన్నీ అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఒక వైపు రుణాల రికవరీ, మరోవైపు సచివాలయ స్థాయిలో ఈకేవైసీ జరుగుతోంది. దీంతో అందరూ సతమతమవుతున్నారు. గతేడాది అక్టోబరు 2, డిసెంబరు 1, ఈ నెల మొదటి వారం ఇలా గడువులు విధించినా ప్రక్రియ ఇంకా కొలిక్కి రావడం లేదు. డీసీటీ, ఫ్రీ మైగ్రేషన్, గో లైవ్ తదితర దశల్లో వీటిని పూర్తి చేయాలి. పూర్తయితే పీఏసీఎస్‌ల్లో ఏళ్లుగా జరిగిన బినామీ రుణాలు, నిధులు స్వాహా వంటి అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. రబీ కాలంలో పెసర, మినుము పంటలు తీసే పనుల్లో కొందరుండగా, ధాన్యం కొనుగోలు వేగవంతం లేకపోవడంతో నూర్పులు చేసే పనుల్లో మరికొందరు నిమగ్నమయ్యారు. ఇంకొందరు వృత్తి పనిమీద వేర్వేరు ప్రాంతాలకు వెళ్లడం, ఆధార్ అనుసంధానమైన మొబైల్ లేకపోవడం, అవగాహన లేక ఇబ్బందులు పడుతున్నారు.

పారదర్శకత కోసమే..



పీఏసీఎస్‌ల్లో రైతుల రుణాలు ఇవ్వడం, వ్యవసాయ ఉత్పత్తులు అమ్మేందుకు అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర, నాబార్డు, రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాయి. వీటివల్ల రైతులకు మేలు జరగనుంది. మరో రెండు రోజుల్లో డీసీటీ ప్రక్రియ పూర్తి చేసేందుకు గడువు ఇచ్చారు. ఈ మేరకు పీఏసీఎస్, సచివాలయ సిబ్బందికి సూచిస్తున్నాం.

– బి.రూపేష్‌కుమార్, జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్, డీసీసీబీ ఆడిటర్, గార మండలం

ఉద్యోగ భద్రత కల్పించాలి



ద్వారకాతిరుమలరావుకు వినతిపత్రం అందిస్తున్న ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ కార్మికుల కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి సంస్థ ద్వారా నేరుగా జీతాలను చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం జిల్లాకు విచ్చేసిన డీజీపీ, ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమలరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో 7,800 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. ఆప్కాస్ కార్పొరేషన్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను చేర్చి, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం కల్పించి న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎండీ స్పందిస్తూ త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు దాసరి కిరణ్, ట్రెజరర్ ఆర్.నవీన్, రాష్ట్ర సలహాదారులు అనిల్ కుమార్, రామ్మోహన్, రాజారావు, సంతోష్, పి.రాజా, గోపి తదితరులు పాల్గొన్నారు.

బుడుమూరులో దళితుల ధర్నా



ధర్నా చేపడుతున్న దళిత కుటుంబాలు

ఎచ్చెర్ల : లావేరు మండలం బుడుమూరు గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న దళితులు ఎవరు చనిపోయినా శ్మశానవాటికకు తీసుకువెళ్లేందుకు దారి లేకుండాపోయిందని వాపోతూ మంగళవారం ధర్నా చేపట్టారు. పూర్వం నుంచి ఉన్న దారులు జిరాయితీ భూములు కావడంతో రైతులు రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇక్కడ సుమారు 250 పైగా దళిత కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం రెండెకరాల్లో శ్మశానం కేటాయించినా అక్కడికి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు దారి చూపించాలని కోరారు.

మహిళా కళాశాలలో సర్టిఫికెట్ కోర్సులు



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్ర, అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల సాధారణ డిగ్రీ, పీజీ కోర్సులతోపాటు సర్టిఫికెట్ కోర్సులకు నిలయంగా మారుతోందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు పేర్కొన్నారు. ఆ కళాశాలలోని బోటనీ విభాగం హెచ్‌వోడీ ఎస్.రుద్రమరాణి ఆధ్వర్యంలో 'మోడ్రన్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్' పేరిట నూతన సర్టిఫికెట్ కోర్సును మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. కోర్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్ర మాట్లాడుతూ కొత్త వ్యవసాయ పద్ధతులపై ఈ కోర్సు ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి హాజరైన ఏపీపీఎస్ఎఫ్ జిల్లా మేనేజర్ పి.రేవతి మాట్లాడుతూ విద్యార్థులు వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని హితవు పలికారు. ఏపీపీఎస్ఎఫ్ డీఆర్పీ వై.సూర్యకుమారి వ్యవసాయ రంగంలో వచ్చిన సరికొత్త పద్ధతులు, సాంకేతికతలు, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు.

హడావుడి పనులు.. నాణ్యతకు తిలోదకాలు

● ఆరకుండానే మట్టి ఫిల్లింగ్
● నాణ్యతకు తూట్లు



ఓ పక్క డివైడర్‌ను నిర్మిస్తూ మరోపక్క మట్టి వేస్తూ..



ఇరువైపులా పలకలు తీయకుండానే మట్టి వేస్తూ..

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సాధారణంగా నిరుపేద ఓ చిన్న ఇల్లు కట్టుకున్నా ఒకటికి వందసార్లు ఆలోచన చేసి ఓ పద్ధతిగా ఎక్కడా వృథా లేకుండా పనులు చేస్తారు. కార్పొరేషన్ అధికారులకు మాత్రం అవేవీ కానరావడం లేదు. రథసప్తమి సందర్భంగా శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఆలోచన సరైనదే అయినా హడావిడిగా చేస్తున్న పనులతో ప్రజాధనం వృథా చేయడాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు. పాలకొండ రోడ్డులో అప్పటికప్పుడే పనులు పూర్తి చేసి డివైడర్ల నిండా మట్టిని నింపేసి మొక్కలు నాటేస్తున్నారు. కనీసం ఓ 15 రోజులైనా క్యూరింగ్ (నీటితో తడపడం) జరగాల్సి ఉన్నా ఆ నిబంధనలేవీ పట్టించుకోవడం లేదు.

శివకామేశ్వరస్వామికి అలంకరణ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో లలితా దేవి సమేత శివకామేశ్వర ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా స్వామి వారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. షిరిడీసాయి సేవా సంఘం ఆధ్వర్యంలో అర్చకులు స్వామివారికి, నందీశ్వరునికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

కొనసాగిన వెలుగు ఉద్యోగుల నిరసన



శ్రీకాకుళం పాతబస్టాండ్: జీతాల బకాయిలు ఇవ్వాలంటూ వెలుగు వీఓఏలు నిర్వహించిన ధర్నా మంగళవారం కూడా కొనసాగింది. ఏడు నెలల వేతనాలు వెంటనే చెల్లించకపోతే ప్రభుత్వ యంత్రాంగాన్ని దిగ్బంధిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పేకల తేజేశ్వరరావు, ఏపీ వెలుగు వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభావతి, జి.అసిరినాయుడు హెచ్చరించారు. వీఓఏల 7 నెలలు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఏపీ వెలుగు వీఓఏల ఉద్యోగుల సంఘం, సీఐటీయూ కలెక్టరేట్ వద్ద మంగళవారం సామూహిక నిరాహార దీక్షలు కొనసాగించారు. దీక్షలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్వీ రమణ సంఘీభావం తెలిపారు. అయితే ఫిబ్రవరి నాల్గో తేదీన ప్రభుత్వం చర్చలకు పిలవడంతో తాత్కాలికంగా ఈ దీక్షలను నిలుపుదల చేశారు.

అంబేడ్కర్‌కు నివాళులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో భారత్ సంవిధాన్ గౌరవ్ దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. నియోజకవర్గ బీజేపీ సహాయ కన్వీనర్ సంపతరావు నాగేశ్వరరావు, నాయకులు పైడి సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగించే రైతుబజారు రోడ్డు వద్ద పైప్ లైను పాడైపోయింది. పనుల నిమిత్తం గొయ్యి తీసి వారమైనా పూడ్చకుండా వదిలేయడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులకూ ఇబ్బందులు తప్పడం లేదు.

– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)

వంటగది ఇలా.. వండేదెలా..



చింతువలస ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మెనూ ప్రకారం వండాల్సిన రాగిజావ, గుడ్లను ఆరుబయట వండాల్సిన పరిస్థితి వచ్చింది. వంట గది పాడైపోవడంతో వర్షం వచ్చినా, ఎండ కాసినా ఇబ్బందులు పడుతున్నామని కుక్ కమ్ హెల్పర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశామని, నిధులు వచ్చాక మరమ్మతులు చేస్తామని చెప్పారని హెచ్ఎం జి.పావని తెలిపారు.

– గార

వృథాగా తాగునీరు



సింగూరు వద్ద నాగావళి నదిలోని సమీకృత మంచినీటి పథకం నుంచి ఎచ్చెర్ల మండలంలో పలు గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే ఫరీదుపేట పంపుహౌస్ వద్ద నీరు లీకై తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

వైఎస్సార్ సీపీ నాయకుడికి సత్కారం



శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న దవళపేట గ్రామస్తులు

జి.సిగడాం: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తిని మంగళవారం దవళపేట గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామంలో నాలుగేళ్లుగా పేదలు, వృద్ధుల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీలో కీలక పదవి ఇచ్చిన నేపథ్యంలో శ్రీరామమూర్తిని గ్రామస్తులు సత్కరించారు. కార్యక్రమంలో కంచరాన రమణారావు, పేడాడ స్వాతినాయుడు, పేడాడ శ్యామలరావు, బొడ్డేపల్లి ఉదయ్‌కుమార్, కంచరాన రామ్మోహనరావు, ,పేడాడ నారాయణరావు, పేడాడ కృష్ణంరాజు, మధుసూదనరావు, రమణ, చందు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?



అధికారులను నిలదీస్తున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

జి.సిగడాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గత ప్రభుత్వం హయాంలో ప్రారంభమైన తాగునీటి పథకం పనులు పూర్తి చేయాలని అధికారులకు ఫిర్యాదు చేశామని, అయినా తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రీవెన్స్ ఫిర్యాదును మూసివేశారని వాండ్రంగి ఎంపీటీసీ సభ్యురాలు బూరాడ శ్రీదేవి, సర్పంచ్ సాకేటి నాగరాజు సభ దృష్టికి తీసుకొచ్చారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాల చెల్లింపు వంటి సమస్యలపై ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచులు బుడారి లక్ష్మణరావు, తొత్తడి రామారావు, వడిశ మహేశ్వరావు, బోగాది అప్పలనాయుడు, మహదాస్యం చిన్నారావు, కంది రమాదేవి తిరుమరెడ్డి వెంకటరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు పండించిన ధాన్యం ఎందుకు కొనుగోలు చేయడం లేదని సభ్యులు చిన్నారావు, డీఆర్‌వలస ఎంపీటీసీ కుమరాపు రమేష్‌నాయుడు ప్రశ్నించారు. సీసీ రోడ్ల పనులు పూర్తి చేసినా ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని సర్పంచులు డబ్బాడ ఆదినారాయణ, తిరుమరెడ్డి వెంకటరావు అధికారులను నిలదీశారు. సమావేశంలో ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, కుమరాపు రమేష్‌నాయుడు, కీర్తి తవుడమ్మ, మక్క శ్రీలత, పెద్ది శ్రీనివాసరావు, భూపతి సరేష్‌కుమార్, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, డీటీ ఎన్.నిర్మల, ఎంఈఓ అరసాడ రవి, వైద్యాధికారి పేకల సుమబిందు, ప్రతిజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీ విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సర్పంచ్

ఎచ్చెర్ల క్యాంపస్/ఎచ్చెర్ల: శ్రీకాకుళం పట్టణంలోని బీకేఎస్ కళాశాల, లయన్స్‌క్లబ్‌లు నిర్వహించిన క్విజ్ పోటీల్లో ముద్దాడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. 10వ తరగతి విద్యార్థులు షర్మిల, హారిక, భవానీ, భార్గవ్, రేవంత్‌లతో కూడిన బృందం మొదటి బహుమతి సాధించింది. వీరిని హెచ్ఎం దున్న రామ్మోహన్‌రావు, సర్పంచ్ ముద్దాడ శంకర్, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: లయన్స్‌క్లబ్ నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో శ్రీకాకుళం పాతహౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 80 అడుగుల రోడ్డులో ఉన్న బీకేఎస్ జూనియర్ కాలేజ్ వేదికగా నిర్వహించిన ఈ పోటీల్లో సీహెచ్ కార్తీక్, వి.చరణ్‌దీప్, ఆర్.గౌతమ్, కె.హాసిని, కె.సాయిస్పందనలతో కూడిన పదో తరగతి విద్యార్థుల బృందం క్విజ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ అన్నెపు లావణ్యారాణి, అన్నెపు రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ బి.కిరణ్‌కుమార్, తదితరులు అభినందించారు.

సంక్షిప్తంగా..

మహిళలకు కుట్టుమిషన్ల వితరణ



శ్రీకాకుళం అర్బన్: రోటరీక్లబ్ శ్రీకాకుళం, రోటరీ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్ సంయుక్త ఆధ్వర్యంలో క్లబ్ గవర్నర్ రావూరి వెంకటసుబ్బారావు చేతులమీదుగా 25 మంది పేద మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. మంగళవారం శ్రీకాకుళం బ్యాంకర్స్ కాలనీలోని సత్యసాయి మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ శ్రీకాకుళం అధ్యక్షుడు యెరుకోల మురళీమోహన్ మాట్లాడుతూ క్లబ్ తరఫున 2023–24 ఏడాదికి గాను నిరుపేద మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఒక్కొక్కటి రూ.25 వేలు విలువైన కుట్టుమిషన్లను వితరణ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సర్వేతో సమగ్ర సమాచారం

జి.సిగడాం : జిల్లాలో అన్ని పంచాయతీల పరిధిలోనూ గ్రామాలపై సర్వే చేస్తున్నామని సర్వే ఆఫ్ ఇండియా సర్వే అధికారి ఎస్ఏ రసూల్ అన్నారు. మంగళవారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మంలో సర్వేయర్ మొయ్యి ఈశ్వరరావు, ఏఎస్ఓ పాదిలాపు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



శ్రీకాకుళం కల్చరల్: కలెక్టర్ బంగ్లా సమీపంలోని మావూరి వీధిలో ఒంటరి మహిళ జోగి సరస్వతికి మదర్స్ లవ్ ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి సుప్రజ రౌత్ మాట్లాడుతూ ఎవరైనా నిరుపేదలకు సాయం కావాల్సి వస్తే 9030132877, 8790944902 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సమాజ సేవకులు ఉర్లం శివతేజ, ఫౌండేషన్ సభ్యులు ఐవీఆర్ హర్ష, సింగంపల్లి తాతారావు, జీఈవో సభ్యులు చింతు సంతోషిని, వాన జోగారావు, జ్యోతి పాల్గొన్నారు.